క్లుప్తంగా

ముత్యాలమ్మను దర్శించుకున్న రవి సన్నారెడ్డి



ముత్యాలమ్మ ఆలయంలో రవి సన్నారెడ్డి

చిల్లకూరు : తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మను గురువారం శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని గతంలో చెప్పానని తెలిపారు. ఈ క్రమంలో ఆలయ ఆవరణలో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా గదులు నిర్మించామని, వాటిని ఆలయ ఈవో నవీన్‌కుమార్‌కు అప్పగించినట్టు తెలిపారు. ఆయన వెంట ఆయన భార్య మమత, ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖర రెడ్డి, ఆలయ అర్చకులు శివకుమార్‌స్వామి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

కలువాయిలో కొండచిలువ హల్‌చల్



కొండ చిలువను పట్టుకుంటున్న యువకులు

కలువాయి: మండల కేంద్రమైన కలువాయిలోని శివసాయి కళాశాల సమీపంలో బుధవారం రాత్రి పది అడుగుల పొడవు ఉన్న భారీ కొండ చిలువ హల్‌చల్ చేసింది. దాన్ని చూసి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కొంతమంది యువకులు దాన్ని పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు.

సుస్థిర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సైదాపురం/రాపూరు : సుస్థిర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ రాష్ట్ర పరిశీలకులు రమేష్ తెలిపారు. ఆయన గురువారం సైదాపురం, రాపూరు ఎంపీడీవో కార్యాలయాల్లో గురువారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అధికారులకు ఇచ్చిన శిక్షణను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులపై అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. సైదాపురం, రాపూరు ఎంపీడీవోలు పురుషోత్తం శివకుమార్, భవాని, రాపూరు ఎంపీపీ ప్రసన్న పాల్గొన్నారు.

మహిళకు రూ.50 వేల సాయం

చిల్లకూరు : మండలంలోని కలవకొండ గ్రామానికి చెందిన బూదూరు మాధవయ్య భార్య శ్రీదేవి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె వైద్యం కోసం మండలంలోని సీనియర్ క్రికెటర్లు గురువారం రూ.50 వేలు సాయం చేశారు. క్రికెట్ కమిటీ సభ్యులు మోహన్, రఘుబాబు, మధు మాట్లాడుతూ ప్రతి ఏటా ఫిబ్రవరిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. క్రీడాకారులు గెలుపొందిన నగదు బహుమతిని పేదలకు విద్య, వైద్యానికి అందజేస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

తిరుపతి కల్చరల్: పాస్టర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గూడూరులో ప్రీ క్రిస్మస్ గ్రాండ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, తిరుపతికి చెందిన ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పాస్టర్లు, సంఘ కాపరులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వి.ప్రభుదాస్, ప్రొఫెసర్ రత్నశేఖర్, చైర్మన్ కొర్నేలియస్, కార్యదర్శి డేవిడ్, దేవప్రసాద్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు వాయిదా

కోట : మండలంలోని కేసవరంలో గురువారం జరగాల్సిన రెవెన్యూ సదస్సు వాయిదా వేసినట్లు తహసీల్దార్ జయజయరావు తెలిపారు. భారీ వర్షాల కారణంగా సదస్సును జనవరి 6వ తేదీకి వాయిదా వేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

బస్సును ఢీకొన్న మరో బస్సు

తడ: మండలంలోని తడకండ్రిగ పంచాయతీ బోడిలింగాలపాడు వద్ద గురువారం రెండు బస్సులు ఢీకొన్నాయి. స్థానికుల కథనం మేరకు.. శ్రీసిటీలోని ఒక పరిశ్రమలో పని చేసే కార్మికులను తీసుకువెళుతున్న బస్సు బోడిలింగాలపాడు వద్ద జాతీయ రహదారిలో మలుపు తిరుగుతోంది. అదే సమయంలో శబరిమల నుంచి విజయవాడకు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. రెండు బస్సుల్లో ఉన్న ఎవరికీ గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలం సోమసముద్రం సమీపంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్‌ఐ చిన బలరామయ్య కథనం మేరకు.. మండలంలోని సోమసముద్రం ఎస్సీ కాలనికి చెందిన ఈదూరు రవి (38), అతని భార్య ప్రైవేటు పరిశ్రమల్లో పని చేస్తున్నారు. గురువారం ఉదయం రవి భార్యను పనికి పంపి తాను పంట పొలాల వద్దకు వచ్చాడు. అక్కడ శవమై కనిపించాడు. అక్కడ ఏమి జరిగిందనే విషయం విచారణలో తేలాల్సి ఉందని ఎస్‌ఐ తెలిపారు.

పెళ్లకూరు: కప్పగుంటకండ్రిగ కాజ్‌వేపై స్వర్ణముఖినది వరద



సూళ్లూరుపేట రూరల్: కోటపోలూరు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలో వర్షపు నీరు, దొరవారిసత్రం: కుప్పారెడ్డిపాళెం వద్ద పాలకాలువ వరద నీటిలో మునిగిన బ్రిడ్జి, కాళంగి నది వద్ద తహసీల్దార్ శైలకుమారి







కుండపోత వర్షం

- ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, కాలువలు
- ప్రమాదకర స్థితికి చేరుకున్న చెరువులు
- అప్రమత్తమైన అధికారులు
- సూళ్లూరుపేటలో 167 మి.మీల వర్షపాతం నమోదు
- నీట మునిగిన పంట పొలాలు

సూళ్లూరుపేట రూరల్/సూళ్లూరుపేట/పెళ్లకూరు/చిల్లకూరు/కోట/రాపూరు/సైదాపురం/దొరవారిసత్రం /నాయుడుపేట టౌన్/వెంకటగిరి రూరల్/డక్కిలి/బాలాయపల్లి(సైదాపురం) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో బుధవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. జనజీవనం స్తంభించింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల బ్రిడ్జిల మీదుగా నీరు ప్రవహిస్తుండడంతో అధికారులు రాకపోకలను నిలిపేశారు. రెవెన్యూ సిబ్బందిని కాపలాగా ఉంచారు. కొన్నిచోట్ల రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంపలు వేశారు.

- సూళ్లూరుపేట మండలం కోటపోలూరు వద్ద ఉన్న పుచ్చకాలువ పొంగడంతో పక్కనే ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలో భారీగా వరద నీరు చేరింది. దొండాకాలువ నిండుగా ప్రవహిస్తుండడంతో మంగళంపాడు, దామానెల్లూరు గ్రామాలకు రాకపోలకు నిలిచిపోయాయి. కాళంగి నది, నెర్రికాలువల్లో నీరు నిండుగా ప్రవహిస్తోంది. సూళ్లూరుపేట మండలంలో గురువారం సాయంత్రం వరకు 167 మి.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.
- పెళ్లకూరు మండలంలోని స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. చెంబేడు, కొత్తూరు తదితర గ్రామాల చెరువులు నిండి ప్రమాదకర స్థాయి చేరుకున్నాయి. కలవకూరు చెక్‌డ్యామ్, కప్పగుంట కండ్రిగ కాజ్‌వేలపై స్వర్ణముఖినది ఉధృతంగా ప్రవహిస్తోంది. కలవకూరు, పిడికిటిమాల, యడపూడి, అనకవోలు, పెరుమాళ్లపల్లి, జంగాలపల్లి, పాలచ్చూరు, కప్పగుంటకండ్రిగ, దిరసనమాల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఎస్‌ఐ నాగరాజు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. పాలచ్చూరు వద్ద మామిడికాలువ ప్రవాహం ప్రమాదకరంగా ఉండడంతో రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంచె వేశారు. చవటకండ్రిగ, ఎగువ తాగేలి, చిల్లకూరు, దొడ్లవారిమిట్ట, శిరసనంబేడు గ్రామాల్లోని దళితకాలనీల చుట్టూ వరదనీరు చేరడంతో అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
- చిల్లకూరు: గూడూరు, చిల్లకూరు మండలాల్లో భారీ వర్షం కురుస్తుండడంతో జన జీవనం స్తంభించింది. చెరువుల్లోకి నీరు చేరుతోంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవడంతో పంచాయితీ కార్యదర్శులు అప్రమత్తమయ్యారు. నీటిని క్లోరినేషన్ చేసి ప్రజలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు.
- కోట మండలంలోని అల్లంపాడు చెరువు కలుజు పొంగడంతో 200 ఎకరాల్లో వరినాట్లు ముంపునకు గురయ్యాయి. భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జయజయరావు సూచించారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని వీఆర్వోలను ఆదేశించారు. చెరువుల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు.
- రాపూరు మండలంలోని చెరువులు నిండి కలుజులు ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. వర్షానికి తోడు ఈదురుగాలులు వీస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- సైదాపురం మండలంలోని చెరువుల్లోకి నీరు చేరుతోంది. కైవల్యానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి కోరారు.
- దొరవారిసత్రం మండలంలోని కాళంగి నది, నెర్రికాలువ, కన్నాకాలువ, పాలకాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పూలతోట, కుప్పారెడ్డిపాళెం గ్రామాల వద్ద బ్రిడ్జిలు నీట మునగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ శైలకుమారి, పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అక్కరపాక, మినమనముడి, పోలిరెడ్డిపాళెం గ్రామాల వద్ద ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిల్లోకి భారీగా నీరు నిలిచింది. వెదురుపట్టు, కుప్పారెడ్డిపాళెం, తల్లంపాడు, లింగంపాడు, మోదుగుళపాళెం, బుదరమడుగు, తనియాలి, పూలతోట, నేలపట్టు, మైలాంగం, కల్లూరు, శ్రీధనమల్లి, తొగరాముడి గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. ప్రస్తుతం వరి పంట ఎన్ను, పొట్ట దశలో ఉంది. కొత్తపల్లిలో రెండు రోజుల క్రితం సుమారు వంద ఎకరాల్లో వేరుశనగ విత్తనాలు వేశారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షానికి విత్తనాలు కొట్టుకుపోయి నాశనం అయినట్టు రైతులు వాపోతున్నారు.
- నాయుడుపేట పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. రాజాగోపాలపురం, రావువారి వీధి, గరీడీ వీధి, బజారు వీధులు జలమయమయ్యాయి. స్వర్ణముఖి నది కాజ్‌వేపైన ప్రవహిస్తోంది. వెంకటగిరి వైపు రాకపోకలు ఆగిపోయాయి. ఎస్‌ఐలు శ్రీనివాసులు రెడ్డి, లక్ష్మీభవాని, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా నదీ ప్రవాహాన్ని పరిశీలించారు. తహసీల్దారు రాజేంద్ర మండలంలోని మామిడి కాలువ, స్వర్ణముఖి ప్రవాహాన్ని పరిశీలిస్తున్నారు. అటువైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.
- వెంకటగిరి పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కైవల్యానది, గొడ్డేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వెంకటగిరి పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయం వద్దనున్న చప్టా మీదుగా నీరు ప్రవహిస్తోంది.
- డక్కిలి మండలంలో వాగులు, ఏరులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మాటుమడుగు సమీపంలోని కైవల్యానదిపై నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు లింగసముద్రం, మాటుమడుగు బ్రిడ్జిలను పరిశీలించారు. ఇరువైపులా ముళ్లకంపలు వేయించి రాకపోకలను నిలిపేశారు.
- బాలాయపల్లి మండలంలో వెంకటగిరి-గూడూరు రోడ్డులోని వెంకటరెడ్డిపల్లి వద్ద నేరేడు కాలువ పొంగింది. జయంపు -బాలాయపల్లి రోడ్డులోని కాజ్‌వే మీదుగా నీరు ప్రవహిస్తోంది. తహసీల్దార్ సుబ్రమణ్యం లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.
- సూళ్లూరుపేట మండలంలోని కాళంగి డ్యామ్‌లో 10 గేట్లు ఎత్తి, 12 వేల క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేయడంతో కాజ్‌వేపై సుమారు రెండు మీటర్లు లోతు నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఈ మార్గంలో రాకపోకలను ఆపివేయాలని సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి యాదవ్ దొరవారిసత్రం పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఆమె స్వయంగా వెళ్లి వరద ఉధృతిని పరిశీలించి, అధికారులకు సూచనలిచ్చారు. దొరవారిసత్రం పోలీసులను అక్కడే పహారా ఏర్పాటు చేశారు.



కోట: అల్లంపాడులో ముంపునకు గురైన వరినాట్లను చూపుతున్న రైతులు

ఎకరాకు రూ.50 వేలు వెచ్చించాము



కొత్తపల్లిలో రెండు రోజుల కిందటే సుమారు 100 ఎకరాల్లో వేరుశనగ విత్తనాలు వేశారు. ఎకరాకు రూ.50 వేలు వరకు వెచ్చించి వేరుశనగ పంట వేశాము. ప్రస్తుతం కురిసిన వర్షంకి పొలాల్లో వర్షం నీళ్లు నిలబడిపోయాయి. ఈవర్షాలు ఇలాగా కొనసాగితే మాత్రం వేరుశనగ పంటపై ఆశలు వదులుకోకతప్పదు.

– గద్దం తిరుములు, కొత్తపల్లి, దొరవారిసత్రం



డక్కిలి: మాటుమడుగు బ్రిడ్జి వద్ద ముళ్లకంపలు వేస్తున్న అధికారులు



సైదాపురం మండలంలో పరవళ్లు తొక్కుతున్న కైవల్యా నది



డక్కిలి: నిండలి కైవల్యానది వద్ద అధికారుల పరిశీలన



దొరవారిసత్రం: కొత్తపల్లిలో వేరుశనగ పంటలో నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతు



నాయుడుపేట సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది



సూళ్లూరుపేట: మావిళ్లపాడు-తనియాలి మార్గంలో కాళంగినది ప్రవాహం



వెంకటగిరి రూరల్: కాశీవిశ్వనాథస్వామి ఆలయం వెనుక వైపు ఉన్న కాజ్‌వేపై వరద నీటి ప్రవాహం

కార్యకర్తలకు అండగా ఉంటాం



16వ వార్డు కౌన్సిలర్ ధనియాల రాధమ్మను పరామర్శిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం తన నివాసంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కక్ష సాధింపులకు పాల్పడుతోందన్నారు. అనంతరం ఆయన వెంకటగిరిలోని పలువురు కార్యకర్తల ఇళ్లకు చేరుకుని పరామర్శించారు. 16వ వార్డు కౌన్సిలర్ ధనియాల రాధను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 5వ వార్డుకు చెందిన క్రిస్టియన్ మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షుడు వెందోటిబాబు మేనత్త, కో–ఆప్షన్ మాజీ సభ్యుడు వేముల జ్ఞానభూషణం సతీమణి సుశీలమ్మ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అలాగే 7వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ కొండ్రెడ్డి రోశిరెడ్డి సతీమణి నవనీతమ్మ ఇటీవల మరణించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 19వ వార్డు కౌన్సిలర్ వహిద, యస్థానిబాషా కుమార్తె రహమతునిస నిశ్చితార్థం జరిగింది. నేదరుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి నవ వధువుని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, కందాటి కళ్యాణి, పులిప్రసాద్‌రెడ్డి, బండి రమేష్‌రెడ్డి, తలపల మల్లికార్జున్ పాల్గొన్నారు.

పంగిలి చెరువుకు తాత్కాలిక మరమ్మతులు



పంగిలి చెరువుకు పడిన రంధ్రాన్ని ఇసుక బస్తాలతో పూడుస్తున్న రైతులు

రాపూరు: మండలంలోని పంగిలి పెద్ద చెరువుకు గురువారం తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినట్లు ఏఈ సర్దార్ తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంగిలి చెరువులోకి నీరు చేరిందన్నారు. ఈ క్రమంలో కట్టకు రంధ్రం ఏర్పడిందని తెలిపారు. గురువారం తెల్లవారు జామున నుంచి భారీ వర్షం కుస్తుండడంతో రంధ్రం పెద్దదైందన్నారు. ఈ విషయాన్ని రైతులు అధికారుల దృష్టికి తీసుకురావడంతో రంధ్రం పడిన చోట ఇసుక బస్తాలు వేసినట్టు తెలిపారు. చెరువు కట్టకు ఎటువంటి ప్రమాదం లేదని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్ష



రిలే దీక్షలు చేపడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

గూడూరు రూరల్ : గూడూరు ఆర్టీసీ డిపో ఎదుట గురువారం సీఐటీయూ నాయకత్వంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ డిపో మేనేజర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘంలోని కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. డ్రైవర్లు, కండెక్టర్లను అక్రమంగా సస్పెండ్ చేస్తున్నారని విమర్శించారు. వేధింపులు మానాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా నిరసనలు తెలిపినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అందువల్లే రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్టు వివరించారు. వారికి ఏపీ ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు కేఆర్ దాసరి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు నిత్యం డ్యూటీలు వేస్తున్నారని, ఉన్నత వర్గాల వారికి డిపోలోనే కాలక్షేపం చేసేలా మెడికల్ సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని డిపో మేనేజర్ సలహా ఇస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, గుర్రం రమణయ్య, ఎం శేషయ్య, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ రైతు గర్జన

పెళ్లకూరు : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు గర్జనను చేపట్టనున్నట్టు డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. పెళ్లకూరు మండలంలోని 24 పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఉదయం 8 గంటలకు తాళ్వాయిపాడు గోమతి సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరనున్నట్లు తెలిపారు.

రేపు సాగునీటి సంఘాల ఎన్నికలు

కలువాయి: మండలంలోని సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నట్లు మైనర్ ఇరిగేషన్ డీఈ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలో 10 సాగునీటి సంఘాలు ఉన్నాయని తెలిపారు. వాటిలో కుల్లూరు, తెలుగురాయపురం, కేశమనేనిపల్లి, చీపినాపి, కనుపూరుపల్లి, పెదగోపవరం, చవటపల్లి, దాసరిపల్లి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

13 జామాయిల్ చెట్లు నరికివేత

రాపూరు: మండలంలోని తూమాయి–డైక్ సమీపంలోని రిజర్వ్ ఫారస్టులో బుధవారం అర్ధరాత్రి 13 జామాయిల్ చెట్లను నరికివేసినట్లు రేంజర్ రవీంద్రబాబు తెలిపారు. దుంగలను టాటాఏస్ వాహనంలో తరలిస్తుండగా అటవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకున్నారని పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని వదిలిపెట్టి పారిపోయారని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో తనిఖీ చేయగా 13 జామాయిల్ చెట్లను నరికివేసినట్టు గుర్తించామన్నారు. జామాయిల్ దుంగలను, వాహనాన్ని అటవీశాఖ క్వార్టర్స్‌కు తరలించినట్టు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

సాగరమాల రోడ్డు పనుల పరిశీలన

నాయుడుపేట టౌన్ : మండలంలోని కాపులూరు వద్ద జరుగుతున్న సాగరమాల రోడ్డు పనులను గురువారం తహసీల్దారు రాజేంద్ర పరిశీలించారు. భూమికి పరిహారం ఇవ్వకపోవడంతో రైతు పనులను అడ్డుకున్నాడు. సమాచారం అందుకున్న తహసీల్దారు అక్కడికి చేరుకుని రైతుతో మాట్లాడారు. పరిహారం చెల్లించిన వివరాలను రైతుకు వివరించి సమస్యను పరిష్కరించారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల వద్దకు వచ్చి పరిష్కరించుకోవాలని, రోడ్డు పనులను అడ్డుకోకూడదన్నారు. భూములకు నగదు అందజేసినట్టు తెలిపారు. ఎస్‌ఐ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

భర్తకు ఐదు నెలల జైలు శిక్ష

వెంకటగిరి రూరల్ : వేధింపుల కేసులో భర్తకు వెంకటగిరి కోర్టు ఐదు నెలల జైలు శిక్ష, రూ 500 జరిమానా విధించినట్టు సీఐ ఏవీ రమణ తెలిపారు. డక్కిలి మండలం దగ్గవోలుకు చెందిన వెంకటసుబ్బయ్య భార్యను వేధించేవాడు. ఆమె 2015 లో పోలీసులను ఆశ్రయించింది. ఈ కేసు వెంకటగిరి కోర్టులో విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో కావడంతో నిందితుడికి 5 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి అనూషా తీర్పు చెప్పారు.

మత్స్యకార సంఘాల బలోపేతానికి చర్యలు

చిల్లకూరు : మత్స్యకార సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చిల్లకూరు మత్స్యశాఖ అధికారి రఘుబాబు తెలిపారు. ఆయన గురువారం గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి పరిధిలోని మత్స్యకార సహకార సంఘాల సభ్యులతో కలిసి విజయవాడ బయలుదేరారు. చిల్లకూరు బైపాస్ వద్ద విలేకరులతో మాట్లాడారు. విజయవాడలో శుక్రవారం స్వర్ణాంధ్ర–2047 విజన్ డాక్యుమెంట్ కార్యక్రమానికి హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. దీంతో జిల్లా మత్స్యశాఖాధికారి నాగరాజు సహకారంతో నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి ప్రాంతాలకు చెందిన మత్స్యకార సహకార సంఘాల సభ్యులకు విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో విజన్ డాక్యుమెంట్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

సైదాపురం : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. మండలంలోని అనంతమడుగులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్వేయర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

పెళ్లకూరులో మూడు అర్జీలు

పెళ్లకూరు: మండలంలోని చింతపూడిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముగ్గురు రైతులు మాత్ర మే అర్జీలు అందజేశారు. భారీ వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా చేస్తున్న క్రమంలో సదస్సు నిర్వహించడం ఎంత వరకు సబబని రైతులు ప్రశ్నించారు. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఆర్‌ఐ సంతోషిణిబాయి, వీఆర్వో కళ్యాణి, సర్వేయర్లు సూర్యనారాయణ పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం : మండలంలోని ఆనేపూడి, దామరాయికండ్రిగ, పడమటికండ్రిగ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రోజంతా వర్షం కురుస్తుండడంతో ప్రజలు పెద్దగా రాలేదు. కార్యక్రమంలో తహసీల్దార్ శైలకుమారి, సర్వేయర్ నాగరాజు, ఆర్‌ఐ ప్రవీణ్‌రాయల్, సర్పంచ్ మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సూళ్లూరుపేట రూరల్‌లో..

సూళ్లూరుపేట రూరల్ : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ నరసింహారావు తెలిపారు. సూళ్లూరుపేట మండలంలోని సుగ్గుపల్లి పంచాయతీలో నిర్వహించిన సదస్సులో వివిధ సమస్యలపై 31 అర్జీలు అందాయని తెలిపారు.

నాటు తుపాకీ పేల్చిన కేసులో వ్యక్తి అరెస్టు

రాపూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెనుబర్తి సమీపంలోని అడవిలో ఈనెల 7వ తేదీ రాత్రి నాటు తుపాకీ పేల్చిన ఘటనలో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. ఆయన గురువారం రాపూరు సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పెనుబర్తికి చెందిన తాళ్ల సుధాకర్(26) శొంటిమణి, యాకశిరి శివకుమార్ గిరిజనులు ఈ నెల 7వ తేదీన అడవి జంతువుల వేటకు వెళ్లారని తెలిపారు. శొంటి మణి తుపాకీ పేల్చడంతో గుండు సుధాకర్ కణతకు తగిలిందన్నారు. దీంతో సుధాకర్ మృతి చెందాడన్నారు. ఈ కేసులో శొంటి మణిని అరెస్టు చేసి నాటు తుపాకీని, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సీఐ విజయకృష్ణ, ఎస్‌ఐ వెంకటరాజేష్ ఉన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

నాయుడుపేట టౌన్: మండలంలోని మర్లపల్లి సమీపంలో జాతీయ రహదారిలో ఓ మినిలారీ గురువారం మధ్యాహ్నం అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. లారీలో ఉన్న డ్రైవర్ మాట్లాడలేని స్థితిలోకి చేరుకోవడంతో ఎవరూ పట్టించుకోలేదు. సాయంత్రం వరకు నరకయాతన అనుభవించాడు. అటు వెళుతున్న పెళ్లకూరు మండలం కానూరుకు చెందిన ఆటో డ్రైవర్ మోహన్ గుర్తించి డ్రైవర్‌ను కాపాడి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. మినీ లారీ డ్రైవర్ మలక్‌పేటకు చెందిన సురేష్‌గా గుర్తించారు. హైదారాబాద్ నుంచి చెన్నైకు ఐరన్ ర్యాక్స్ లోడ్‌తో వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది.

స్తంభించిన ట్రాఫిక్

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట సమీపంలోని శ్రీకాళహస్తి బైపాసు రోడ్డులో గురువారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించింది. ఈ రోడ్డులో ఉన్న పెద్ద పెద్ద గుంతల్లో వాహనాలు దిగబడి మరమ్మతులకు గురవుతున్నాయి. నెల్లూరు నుంచి వస్తున్న కంటైనర్ లారీ గుంతల్లో ఇరుక్కుని ఆగిపోయింది. దాన్ని పక్కకు తరలించేందుకు కాలేదు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలబడిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో తిరుపతి, తిరుమల వెళ్లే భక్తులు ఇబ్బందులు పడ్డారు.